సాక్షి
మంచిర్యాల
బుధవారం ; 13 ; సెప్టెంబర్ ; 2023



ఆపరేషన్ పేకాట వివాదాస్పదం?
'ఆపరేషన్ పేకాట' వివాదాస్పదమైంది. తమ పరిధి కాకున్నా.. స్థానిక పోలీసులకు తెలువకుండా పేకాట స్థావరంపై దాడి చేయడం ఇందుకు కారణమైంది. 8లో▸

ఐసెట్ కౌన్సెలింగ్‌కు 130 మంది హాజరు
బెల్లంపల్లి: బెల్లంపల్లి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మంగళవారం ఐసెట్ విద్యార్థులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. 130 మంది విద్యార్థులు హాజరు కాగా, వారి వివరాలు ఆన్‌లైన్‌లో ఎన్‌రోల్ చేసి ధ్రువీకరణ పత్రాలు పరిశీలించారు. ఎంబీఏ, ఎంసీఏ కళాశాలల గురించి అవగాహన కల్పించారు.

గరిష్టం/కనిష్టం
28.0 /25.0

వాతావరణం
ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతాయి. ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలుచోట్ల మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

కొనసాగుతున్న బదిలీలు, ప్రమోషన్ల ప్రక్రియ



సర్టిఫికెట్లు పరిశీలిస్తున్న ఉపాధ్యాయులు

మంచిర్యాలఅర్బన్: జిల్లాలో ఉపాధ్యాయ బదిలీలు, ప్రమోషన్ల ప్రక్రియ కొనసాగుతోంది. ఉపాధ్యాయుల నుంచి అభ్యంతరాల స్వీకరణ, పరిశీలన ప్రక్రియ మంగళవారం పూర్తయింది. ఇందులో ఉపాధ్యాయుల నుంచి 171 అభ్యంతరాలు రాగా 123 ఆమోదం పొందాయి. 47 దరఖాస్తులను తిరస్కరించారు. ఇందులో మూడేళ్లలోపు ఉన్నవాళ్లు ప్రస్తుత పాఠశాల నుంచి కదలబోమని అంగీకరించారు. మరికొంత మంది స్పౌజ్‌ను ఉపయోగించుకోవడం లేదని సమ్మతించడంతో 47 దరఖాస్తులు రిజెక్ట్ అయ్యాయి. వైద్యపరమైన అంశాల్లో నిబంధనలు ఉల్లంఘించారని వచ్చిన ఫిర్యాదు మేరకు నిర్ధారణకు పంపించినట్లు తెలుస్తోంది. బుధవారం సీనియార్టీ జాబితాను వెబ్‌సైట్‌లో ప్రదర్శించనున్నట్లు డీఈవో యాదయ్య తెలిపారు.

నేషనల్ బ్యాడ్మింటన్‌లో క్రీడాకారులకు మెడల్స్



క్రీడాకారులతో జట్టు మేనేజర్ సుధాకర్

మంచిర్యాలటౌన్: ఈ నెల 9నుంచి 12వ తేదీ వరకు బెంగళూరులో జరిగిన అండర్-19 నేషనల్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీల్లో రాష్ట్రానికి చెందిన క్రీడాకారులు గోల్డ్ మెడల్స్ సాధించినట్లు తెలంగాణ రాష్ట్ర జట్టు మేనేజర్, ఉమ్మడి జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యదర్శి పుల్లూరి సుధాకర్ ఓ ప్రకటనలో తెలిపారు. బాలుర సింగిల్స్‌లో రుషీంద్ర, బాలికల సింగిల్స్‌లో రక్షితశ్రీ, మిక్స్‌డ్ డబుల్స్‌లో సాత్విక్‌రెడ్డి, వైష్ణవి గోల్డ్ మెడల్స్ సాధించినట్లు పేర్కొన్నారు. గెలుపొందిన క్రీడాకారులను రాష్ట్ర బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు అభినందించారు.

టెట్ పకడ్బందీగా నిర్వహించాలి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ మోతీలాల్

మంచిర్యాలఅర్బన్: ఈనెల 15న ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)ను పకడ్బందీగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ మోతీలాల్ ఆదేశించారు. మంగళవారం జిల్లా కేంద్రంలో టెట్ నిర్వహణకు నియమించిన రూట్ అధికారులు, సీఎస్‌లు, డిపార్ట్‌మెంట్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో పేపర్-1కు 8,737 మంది, పేపర్-2కు 5,745 మంది అభ్యర్థులు హాజరు కానున్నట్లు తెలిపారు. జిల్లా కేంద్రంతోపాటు నస్పూర్, మందమర్రిలో పరీక్షాకేంద్రాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు తమ అడ్మిట్ కార్డులో ఫొటో, సంతకం లేకుంటే దానిపై ఫొటో అతికించి గజిటెడ్ అధికారితో ధ్రువీకరించి డీఈవో సంతకం చేయించుకోవాలని సూచించారు. పరీక్షాకేంద్రంలోకి సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు తీసుకురాకూడదని సూచించారు. పరీక్ష విధులు, నిబంధనలపై వివరించారు. డీఈవో యాదయ్య, ప్రభుత్వ పరీక్షల విభాగ అధికారి దామోదర్‌రావు పాల్గొన్నారు.

అభ్యసన సామర్థ్యాల పెంపునకు కృషి చేయాలి

మంచిర్యాలఅర్బన్: విద్యార్థుల అభ్యసన సామర్థ్యాల పెంపునకు ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎస్సీఈఆర్టీ పరిశీలకుడు రవిప్రకాశ్ సూచించారు. మంగళవారం జిల్లా సైన్స్ కేంద్రంలో రూం టూ రీడ్ సౌజన్యంతో జిల్లా విద్యాశాఖ మండల స్థాయి తొలిమెట్టు తెలుగు రిసోర్స్ పర్సన్లకు వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ.. ఆర్పీలకు తెలుగు బోధన పద్ధతులు, నూతన బోధన అభ్యసన ప్రక్రియలో ఎదురయ్యే సమస్యలు, సందేహాలను నివృత్తి చేశారు. ప్రతీ ఉపాధ్యాయుడికి లెస్సన్‌ప్లాన్‌లు, ప్రతీ విద్యార్థి వర్క్‌షీట్లు ఇచ్చారు. ఎప్పటికప్పుడు విద్యార్థుల అభ్యసన ఫలితాల మెరుగుదలను సమీక్షించుకోవాలన్నారు. జిల్లా సమగ్రశిక్ష క్వాలిటీ కో ఆర్డినేటర్ సత్యనారాయణమూర్తి, రిసోర్స్ పర్సన్‌లు అర్చన, స్వరూప, రూం టూ రీడ్ రాష్ట్ర ప్రతినిధులు ప్రవీణ్, నితిన్ ఉన్నారు.

కుల సమీకరణాలు!

- 'సామాజికం' వారీగా ఓటర్ల లెక్కింపు
- 'కులగణన' ప్రారంభించిన నాయకులు
- ఎన్నికల్లో ప్రభావితం చేసేవారిపైనే దృష్టి



సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో సత్తా చాటాలని ఆరాట పడుతున్న రాజకీయ నాయకులు ఓటు బ్యాంక్ అధికంగా ఉన్న సామాజిక వర్గాలపై ప్రధానంగా ఫోకస్ పెట్టారు. ఆయా కులాలవారీగా ఓట్లు పట్టేందుకు సన్నద్ధమవుతున్నారు. అధికార బీఆర్‌ఎస్ అన్ని సామాజిక వర్గాలకు ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధి చేకూర్చే ప్రయత్నం చేస్తోంది. దళిత, బీసీ, మైనార్టీ బంధు, గొర్రెల పంపిణీ పథకాలు కులాల ఆధారంగానే కొనసాగుతున్నాయి. ఇక ప్రతిపక్ష పార్టీలు కూడా అసంతృప్తులుగా ఉన్న కులాల ఓట్లను లెక్కకడుతున్నాయి. వచ్చే నెలలో అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ వెలువడే నాటికి ప్రధాన పార్టీల అభ్యర్థుల ఎంపికకు కసరత్తు జరుగుతోంది. ఇప్పటికే బీఆర్‌ఎస్ అందరికన్నా ముందే అభ్యర్థులను ప్రకటించి ఎన్నికల సమరంలోకి దింపింది. ఇక కాంగ్రెస్, బీజేపీ ఎమ్మెల్యే టికెట్ ఆశిస్తున్నవారి నుంచి దరఖాస్తులు స్వీకరించింది. సర్వేల్లో ఆశావహుల బలాలు, బలహీనతలు, ఆర్థిక, సామాజిక స్థితిగతులు, కుల సమీకరణాలను లెక్కలోకి తీసుకుని అభ్యర్థులను ప్రకటించే అవకాశముంది.

రిజర్వ్‌డ్ స్థానాల్లోనూ..

రిజర్వ్‌డ్ స్థానాలైన బెల్లంపల్లి, చెన్నూరు, ఖానాపూర్‌లోనూ ఏ సామాజిక వర్గంవారు ఎక్కువగా ఉన్నారని లెక్కలు వేస్తున్నారు. ఎస్సీ స్థానాల్లో దళిత ఉపకులాలు, బీసీలు, ఎస్టీ, మైనార్టీలు ఓటు బ్యాంక్‌పై కూడా దృష్టి సారించారు. ఆ వర్గాల ప్రాధాన్యం ఏముందనే కోణంలోనూ సర్వేలు చేస్తున్నారు. ఒక్కోచోట గెలుపోటములను ప్రభావితం చేసే కులాల వారీగా లెక్కలు తీస్తున్నారు. అధికారికంగా కుల గణన లేకపోవడంతో ఇప్పటికీ 2011 జనాభా లెక్కల ప్రకారమే ఎస్సీ, ఎస్టీ జనాభా ఆధారంగానే లెక్కలు సాగుతున్నాయి. రాష్ట్ర ఆవిర్భావం తర్వాత 2014లో జరిగిన సమగ్ర కుటుంబ సర్వే, 2018లో శాసనసభ, 2019లో లోక్‌సభ, 2020లో పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల సమయంలో వచ్చిన ఫలితాలు, ఆయా గ్రామాలు, పట్టణాలు మొగ్గు చూపిన కులాలను పరిగణనలోకి తీసుకుంటున్నారు.

ఓట్ల కోసం కులాల లెక్కలు

జిల్లాలోని ప్రధాన మూడు నియోజకవర్గాలైన మంచిర్యాల, బెల్లంపల్లి, చెన్నూరుతోపాటు జన్నారం మండల పరిధిలో ఉన్న ఖానాపూర్‌లోనూ ఏ కులాలు ఎక్కువగా ఉన్నాయని నాయకులు లెక్కలు వేస్తున్నారు. నాలుగు నియోజకవర్గాల్లో మంచిర్యాల జనరల్, బెల్లంపల్లి, చెన్నూరు ఎస్సీ, ఖానాపూర్ ఎస్టీ రిజర్వ్‌డ్ స్థానాలు కావడంతో ఆయా చోట్ల ఎవరి ప్రాబల్యం ఎంత అనేది అంచనా వేస్తున్నారు. మంచిర్యాల నియోజకవర్గంలో ఓసీ, బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనార్టీల లెక్కలు తీస్తున్నారు. బీసీ నినాదం మొదలవడంతో వెనుకబడిన తరగతుల్లో ఏ ఉపకులాలు ఏ మేరకు ఓటింగ్‌లో ప్రభావితం చూపుతాయనేది ఆరా తీస్తున్నారు. బీసీల్లో ప్రధానంగా ఉన్న ఉపకులాలు, వాటి జనాభా, ఓట్ల సంఖ్య తేల్చేందుకు కసరత్తు చేస్తున్నారు. ఇటీవల ఓ రాజకీయ పార్టీ కులాల వారీగా ఎన్ని ఓట్లు ఉన్నాయని సర్వే చేపట్టింది. ఇందుకోసం గ్రామాలు, పట్టణాల్లో ఎక్కడ.. ఏ వర్గం ఓటర్లు ఉన్నారు? గతంలో ఏ పార్టీకి ఓట్లు వేశారు. తాజాగా ఏ పార్టీ వైపు మొగ్గు చూపుతున్నారనే కోణంలోనూ వివరాలు సేకరించింది.

అభ్యర్థుల ఎంపికలో కీలకం

రాజకీయ పార్టీలు తమ అభ్యర్థులను ఎంపిక చేయడంలోనూ వారి సామాజిక వర్గాన్ని ఓ ప్రాతిపాదికగా తీసుకుంటున్నాయి. అభ్యర్థి కులాన్ని బట్టి ఆ స్థానంలో ఓటు బ్యాంక్ ఎంత? ఏ మేరకు ఆ వర్గం వారు ఎన్నికలను ప్రభావితం చేస్తారనే దానిని పరిగణనలోకి తీసుకుంటున్నారు. ఇక రాష్ట్ర వ్యాప్తంగా సామాజిక వర్గాలకు సమతూకం పాటించే క్రమంలో ఏ వర్గానికి ఎన్ని సీట్లు ఇస్తారోనని.. జిల్లాలోని ఆశావహులు ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు. ఇందులో ఆయా కులాల్లో పోటీ పడుతున్న వారితో లెక్కలు వేసుకుంటున్నారు. రాష్ట్రాన్ని యూనిట్‌గా తీసుకున్నప్పుడు ఏ సామాజికవర్గానికి ఎన్ని సీట్లు అనే కోణంలో జిల్లాలో అభ్యర్థుల ఎంపిక కీలకం కానుంది. ఈ క్రమంలో నియోజకవర్గాల్లో నాయకులు తమ వర్గం ఓట్లే ఎక్కువగా ఉన్నాయంటూ ఎవరికి వారే ప్రచారం చేసుకోవడం ప్రారంభించారు.

కార్యదర్శుల పాత్ర కీలకం



అవార్డులు అందజేస్తున్న కలెక్టర్ బదావత్ సంతోష్, అదనపు కలెక్టర్ రాహుల్, ఎమ్మెల్యే నడిపెల్లి

- కలెక్టర్ బదావత్ సంతోష్

మంచిర్యాలఅగ్రికల్చర్: గ్రామాలాభివృద్ధిలో పంచాయతీ కార్యదర్శుల పాత్ర కీలకమని కలెక్టర్ బదావత్ సంతోష్ పేర్కొన్నారు. మంగళవారం నస్పూర్ సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ అవార్డు-2023 ప్రదానోత్సవ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాహుల్, ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు, జెడ్పీ సీఈవో నరేందర్, డీపీవో వెంకటేశ్వర్‌రావు, డీఆర్డీవో శేషాద్రితో కలిసి జిల్లాలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు అవార్డులు ప్రదానం చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో 310 పంచాయతీలుండగా 15 ఉత్తమ పంచాయతీలను ఎంపిక చేసినట్లు తెలిపారు. భీమారం మండలం ఎల్కేశ్వరం, భీమారం, కన్నెపెల్లి మండలం వీరాపూర్, లక్సెట్టిపేట మండలం రంగపేట్, తిమ్మాపూర్, వెంకట్రావ్‌పేట, బెల్లంపల్లి మండలం లింగాపూర్, హాజీపూర్ మండలం టీకనపల్లి, నెన్నెల మండలం చిత్తాపూర్, జన్నారం మండలం దేవునిగూడ, మందమర్రి మండలం అందుగులపేట్, వేమనపల్లి మండలం నిల్వాయి, చెన్నూర్ మండలం కిష్టంపేట, కాసిపేట మండలం దేవాపూర్, దండేపల్లి మండలం దండేపల్లి పంచాయతీలను ఎంపిక చేసి సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు అవార్డులు అందించినట్లు తెలిపారు. దేశంలో ఉత్తమ గ్రామపంచాయతీలుగా నిలిచేలా పని చేయాలని సూచించారు. జెడ్పీ వైస్ చైర్మన్ సత్యనారాయణ, సంబంధిత శాఖల అధికారులు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సరిహద్దుల్లో నిరంతర పర్యవేక్షణ


కోటపల్లి: మహారాష్ట్ర-తెలంగాణ సరిహద్దు ప్రాంతాల్లో పోలీసుల నిరంతర పర్యవేక్షణ ఉందని జైపూర్ ఏసీపీ మోహన్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని వెంచపల్లి, సుపాక పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ప్రాణహిత నది ఫెర్రిపాయింట్స్‌ను పరిశీలించి అధికారుల ద్వారా వివరాలు తెలుసుకున్నారు. పడవలు నడిపేవారు, మత్స్యకారులతో మాట్లాడి ప్రస్తుత పరిస్థితుల గురించి ఆరా తీశారు. పోలీస్ అధికారులు ఏవిధంగా ఉంటున్నారు? గ్రామంలో ఎలాంటి సమస్యలున్నాయి? అని ప్రశ్నించి వివరాలు తెలుసుకున్నారు. మావోయిస్టుల కదలికలు, సమాచారాన్ని పోలీసులకు అందించాలని సూచించారు. పోలీసులు ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారని, ప్రజల భద్రత తమ బాధ్యతని అని పేర్కొన్నారు. సంఘవిద్రోహ శక్తులకు సహకరించి యువత తమ భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని సూచించారు. సీఐ విద్యాసాగర్, ఎస్సై సురేశ్, ఎంపీటీసీ సభ్యుడు తిరుపతి, నాయకుడు సతీశ్ పాల్గొన్నారు.



వెంచపల్లి పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఏసీపీ మోహన్, సిబ్బంది

నిండుకుండలా 'ఎల్లంపల్లి'

మంచిర్యాలరూరల్(హాజీపూర్): ఎల్లంపల్లి ప్రాజెక్ట్ 19 టీఎంసీలతో నిండుకుండను తలపిస్తోంది. దాదాపు పూర్తిస్థాయి నీటిమట్టంతో ఉంది. మంగళవారం రాత్రి వరకు ప్రాజెక్ట్ నీటి మట్టం 148 మీటర్ల క్రస్ట్ లెవెల్ కాగా, 147.85 మీటర్లకు చేరింది. 20.175 టీఎంసీలకు గాను 19.625 టీఎంసీలు ఉంది. ఎగువ ప్రాంతాల నుంచి 23 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ పథకానికి 321 క్యూసెక్కులు తరలిస్తుండగా, నాలుగు గేట్లు ఎత్తి 23వేల క్యూసెక్కులను గోదావరిలోకి వదిలిపెడుతున్నారు.



జలకళను సంతరించుకున్న ప్రాజెక్ట్

'గూడెం' ఆలయాభివృద్ధికి కృషి చేయాలి

- ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు

దండేపల్లి: మండలంలోని గూడెం శ్రీసత్యనారాయణస్వామి ఆలయ అభివృద్ధికి కృషిచేయాలని ఎమ్మెల్యే దివాకర్‌రావు రెనొవేషన్ కమిటీ సభ్యులకు సూచించారు. నూతన రెనొవేషన్ కమిటీ సభ్యులు మంగళవారం సత్యదేవున్ని దర్శించుకుని పూజలు చేశారు. కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యేతోపాటు రెనొవేషన్ కమిటీ సభ్యులందరినీ ఆలయ అధికారులు శాలువాలతో సన్మానించారు. అర్చకులు, వేదపండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి తీర్థ ప్రసాదాన్ని అందించారు. అనంతరం గుట్టకిందగల శ్రీసత్యనారాయణస్వామి వ్రతమండపంలో రెనొవేషన్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. కమిటీ సభ్యులు దాతల సహకారంతో ఆలయం వద్ద కనీస వసతులు కల్పించాలని సూచించారు. లక్సెట్టిపేట మున్సిపల్ చైర్మన్ కాంతయ్య, ఆర్బీఎస్ జిల్లా కన్వీనర్ గురువయ్య, వైస్ ఎంపీపీ అనిల్, పీఏసీఎస్ చైర్మన్ లింగన్న, ఆలయ ఈవో శ్రీనివాస్, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు శ్రీనివాస్, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.



కమిటీ సభ్యులతో ఎమ్మెల్యే దివాకర్‌రావు

'నడిపెల్లి'ని గెలిపించాలని ప్రసంగాలు
నూతన రెనొవేషన్ కమిటీ సమావేశంలో ఆలయాభివృద్ధి అంశం కంటే మంచిర్యాల ఎమ్మెల్యే దివాకర్‌రావు గెలుపు గురించే అందరూ మాట్లాడటం కనిపించింది. పలువురు అభివృద్ధి కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు తమ ప్రసంగాల్లో వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యే దివాకర్‌రావును భారీ మెజార్టీతో గెలిపించాలని కోరడం గమనార్హం.

ముందస్తు ప్రణాళిక తప్పనిసరి

- రామగుండం సీపీ రెమారాజేశ్వరి
- కమిషనరేట్ పరిధిలోని అధికారులకు ఎన్నికల నియమావళి, చట్టాలపై శిక్షణ

మంచిర్యాలక్రైం: ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు ముందస్తు ప్రణాళిక తప్పనిసరి అని రామగుండం సీపీ రెమా రాజేశ్వరి పేర్కొన్నారు. రానున్న సాధారణ ఎన్నికలను పురస్కరించుకొని చట్టాలు, ఎన్నికల ప్రవర్తనా నియమావళికి సంబంధించిన అంశాలపై కమిషనరేట్ పరిధిలోని పోలీస్ అధికారులకు మంగళవారం శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. కమిషనరేట్ పరిధిలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని సూచించారు. ఎన్నికల నియమావళి విడుదల కాగానే పోలీస్ అధికారులంతా నిబంధనలకు లోబడి విధులు నిర్వహించాలని, గత అనుభవాల దృష్ట్యా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనుమానాస్పద, వివాదాస్పద వ్యక్తులు, రౌడీ షీటర్లు, పాత నేరస్తులను ముందస్తుగా బైండోవర్ చేయాలన్నారు. కమిషనరేట్ పరిధిలో ఏఎస్సై, హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లకు శిక్షణ ఇవ్వనునన్నట్లు తెలిపారు. అందరూ శిక్షణకు హాజరు కావాలని సూచించారు. కార్యక్రమంలో డీసీపీలు సుధీర్ రాంనాథ్ కేకన్, వైభవ్ గైక్వాడ్, ఏఆర్ అడిషనల్ డీసీపీ రియాజ్-ఉల్-హక్, ఏసీపీలు, సీఐలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీ రెమా రాజేశ్వరి

'గణిత' పోస్టుల ఖాళీలపై గందరగోళం

మంచిర్యాలఅర్బన్: జిల్లాలో గణితశాస్త్ర పోస్టుల ఖాళీలపై గందరగోళం నెలకొంది. 2015, 2018లో జరిగిన బదిలీల కౌన్సెలింగ్ సందర్భంగా గణితం స్కూల్ అసిస్టెంట్‌కు బదులు తాత్కాలికంగా భౌతికశాస్త్ర స్కూల్ అసిస్టెంట్‌లతో భర్తీ చేశారు. గణితం బోధించే ఉపాధ్యాయుల స్థానంలో ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయులను అలాట్ చేయడంతో ఆశించిన ఫలితాలు రావడం లేదని తెలుస్తోంది. ఇంకోవైపు బదిలీలు, ప్రమోషన్ ప్రక్రియ నేపథ్యంలో ఆన్‌లైన్‌లో గణిత పోస్టులను తక్కువగా చూపించడంతో ఆ సబ్జెక్టువారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో ఎస్జీటీ ఉపాధ్యాయులకు గణిత ఉపాధ్యాయులుగా ప్రమోషన్ అవకాశం తగ్గడమే కాకుండా నిరుద్యోగ ఉపాధ్యాయ అభ్యర్థుల నియామకాల్లో కూడా కోత పడుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాత్కాలికంగా స్కూల్ అసిస్టెంట్ గణితం పోస్టుల క్యాడర్ స్ట్రెంత్ తగ్గి స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ సైన్స్ క్యాడర్ స్ట్రెంత్ పెరిగే వీలుంది. దీంతో పాఠశాలలో గణితం బోధించే ఉపాధ్యాయుల సంఖ్య తగ్గిపోతుంది. గణితశాస్త్ర పోస్టుల్లో భర్తీ చేసిన ఫిజికల్ సైన్స్ టీచర్లను తొలగించి గణిత ఉపాధ్యాయ ఖాళీలు చూపించాలని కోరుతూ మంచిర్యాల డీఈవో యాదయ్యకు పలువురు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో టీఎంఎఫ్ మంచిర్యాల శాఖ అధ్యక్షుడు ఆనంద్, నాయకులు సురేశ్, శ్రీనివాస్, రాజమౌళి తదితరులున్నారు.



డీఈవోకు వినతిపత్రం ఇస్తున్న ఉపాధ్యాయులు

బియ్యం.. ప్రియం

- సన్నరకం ధరలకు రెక్కలు
- జిల్లాలో తగ్గిన సాగు విస్తీర్ణం
- రైతులకు 'మద్దతు' లేనందునే..
- సామాన్యులపై ధరల భారం

జిల్లాలో బియ్యం ధరలు ఇలా..

రకం	2022లో..	2023లో..
సాయిరాం	రూ.4,800	రూ.5,800
హెచ్ఎంటీ	రూ.4,200	రూ.5,200
బీపీటీ	రూ.3,400	రూ.4,200



దండేపల్లి: మొన్నటిదాక కూరగాయల ధరలు మండిపోగా జనం అల్లాడి పోయారు. ఇప్పుడు సన్నబియ్యం ధరలకు రెక్కలొచ్చాయి. రోజురోజుకు ధరలు పెరుగుతుండడంతో సామాన్యులు బిత్తరపోతున్నారు. గతేడాది కంటే ఈసారి క్వింటాల్‌పై రూ.800 నుంచి రూ.వెయ్యి వరకు పెరిగింది. జిల్లాలో 65శాతం దొడ్డు రకం సాగవుతుండగా సన్న రకం వరి 35శాతమే సాగవుతోంది. నాలుగెకరాలున్న రైతులు మూడెకరాల్లో దొడ్డు రకం, ఎకరంలో తమ కుటుంబ అవసరాల కోసం సన్నరకం పండిస్తున్నారు. దీంతో సన్నాల సాగు తగ్గి బియ్యం కొరత ఏర్పడగా వ్యాపారులు ధరలు క్రమక్రమంగా పెంచేస్తున్నారు.

పెట్టుబడి ఎక్కువ.. దిగుబడి తక్కువ
సన్నరకం వరి సాగు తగ్గడానికి అనేక కారణాలున్నాయి. సన్నరకం వరి సాగు చేస్తే తెగుళ్ల బెడద ఎక్కువగా ఉంటుంది. నివారణకు రైతులు పలు దఫాలు క్రిమిసంహారకాలు పిచికారీ చేస్తుండడంతో పెట్టుబడి ఖర్చులు తడిసి మోపెడవుతున్నాయి. పైగా దిగుబడి కూడా దొడ్డు రకం కంటే తక్కువగా వస్తోంది. పండిన కొద్దిపాటి పంటకు మార్కెట్‌లో గిట్టుబాటు ధర లేక రైతులు నష్టపోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. దొడ్డు రకం వడ్లను ప్రభుత్వమే కొనుగోలు కేంద్రాల ద్వారా కొని మద్దతు ధర చెల్లిస్తోంది. దీంతో చాలా మంది రైతులు దొడ్డు రకం సాగుకే మొగ్గు చూపుతున్నారు.

ధరల నియంత్రణపై పట్టింపేది?
సన్న బియ్యం ధరల నియంత్రణపై అధికారులు దృష్టి సారించడంలేదనే ఆరోపణలున్నాయి. ఉన్నతాధికారులు ప్రతినెలా ధరల నియంత్రణపై సమావేశం నిర్వహించి ధరలు, విక్రయాలపై చర్చించాలి. వ్యాపారులు కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు తీసుకోవాలి. ధరలు మరింత పెరిగే అవకాశం ఉంటే ప్రభుత్వ పరంగా కేంద్రాలు ఏర్పాటు చేసి విక్రయించాలి. కానీ.. జిల్లాలో అవేమీ కనిపించకపోవడంతోనే వ్యాపారులు ధరలు పెంచేస్తున్నారు. పలుచోట్ల రైతులు పండించిన సన్న రకం వడ్లను వ్యాపారులు క్వింటాల్‌కు రూ.2,300 నుంచి రూ.2,500 వరకు కొనుగోలు చేస్తున్నారు. బియ్యంగా మార్చాక రూ.5వేల నుంచి రూ.5,800 వరకు విక్రయిస్తున్నారు. దీంతో కష్టపడి ధాన్యం పండించిన రైతుల కంటే వడ్లుకొని బియ్యం వ్యాపారం చేసేవారే ఎక్కువ లాభపడుతున్నారు. అధికారులు పర్యవేక్షించి బియ్యం ధరలు నియంత్రించాలని ప్రజలు కోరుతున్నారు.

స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రానికి భవనాల పరిశీలన

బెల్లంపల్లి: నిరుద్యోగ యువతీయువకులకు నైపుణ్య శిక్షణ ఇవ్వడానికి రాష్ట్ర ప్రభుత్వం నైపుణ్య శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తోందని కలెక్టర్ బదావత్ సంతోష్ పేర్కొన్నారు. మంగళవారం బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్యతో కలిసి పట్టణంలో ఎత్తివేతకు గురైన సింగరేణి ఎక్స్‌ప్లోరేషన్ విభాగానికి చెందిన భవనాలను పరిశీలించారు. స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రం ఏర్పాటుకు పాత భవనాలు ఎంతవరకు ఉపయోగపడను న్నాయో తెలుసుకున్నారు. ఇతర మౌలిక సదుపాయాలపై ఆరా తీశారు. అక్కడి నుంచి కలెక్టర్ సంతోష్ మున్సిపాలిటీ పరిధిలోని 21వ వార్డుకు వెళ్లారు. డిమాండ్ నోటీసు అందుకున్న లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి ప్రభుత్వానికి రుసుము చెల్లించి ఇంటి పట్టా తీసుకోవాలని సూచించారు. సింగరేణి స్థలాల్లో శాశ్వత నిర్మాణాలు చేపట్టి జీవిస్తున్న వారికి ఇళ్ల పట్టాలు ఇవ్వడానికి ప్రభుత్వం జీవో నంబర్ 76 జారీ చేసిందని తెలిపారు. జీవో ప్రకారం ఇప్పటికే వేలాది మందికి పట్టాలు ఇచ్చినట్లు పేర్కొన్నారు. కొందరు డిమాండ్ నోటీస్ అందుకుని ఇంకా రుసుం చెల్లించలేదని తెలిపారు. అలాంటివారు వెంటనే రుసుం చెల్లించి ఇళ్ల క్రమబద్ధీకరణ చేసుకోవాలని కోరారు. కలెక్టర్ వెంట ఆర్డీవో సురేశ్, డెప్యూటీ తహసీల్దార్ ప్రసాద్, మున్సిపల్ కమిషనర్ కే సమ్మయ్య, మండల సర్వేయర్ మణిరాజు, ఆర్ఐ ఆదిలక్ష్మి తదితరులున్నారు.



భవనం పరిశీలిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

క్లుప్తంగా

పోలంపల్లిలో కూలిన ఇంటిగోడ



కూలిన ఇంటిగోడ

భీమారం(చెన్నూర్): ఇటీవల కురుస్తున్న వర్షాలకు సోమవారం రాత్రి మండలంలోని పోలంపల్లిలో గోనె గంగయ్యకు చెందిన ఇంటిగోడ కూలింది. కుటుంబ సభ్యులతో కలిసి నిద్రిస్తున్న సమయంలో ఒక్కసారిగా పెద్దశబ్దం రావడంతో అంతా బయటకు వచ్చినట్లు తెలిపాడు. అధికారులు సర్వే నిర్వహించి నష్టపరిహారం చెల్లించాలని కోరుతున్నాడు.

దాడి కేసులో ఒకరికి మూడేళ్ల జైలు

కోటపల్లి: దాడి కేసులో ఒకరికి మూడేళ్ల జైలుశిక్ష విధిస్తూ చెన్నూర్ అడిషనల్ జేఎఫ్‌సీఎం కోర్టు న్యాయమూర్తి సంపత్ తీర్పునిచ్చినట్లు సీఐ విద్యాసాగర్, ఎస్సై నరేష్ తెలిపారు. అన్నారం గ్రామానికి చెందిన దుర్గం దీక్ష, సడవలికి పెళ్లి నిశ్చయం కావడంతో బట్టలు పెట్టే విషయంలో దుర్గం అశోక్, లలిత, నందు, సరితతో జరిగిన గొడవలో దుర్గం నందు వాకిట్లో ఉన్న కర్రతో దీక్ష తలపై కొట్టడంతో గాయాలయ్యాయి. కేసు నమోదు చేసిన అప్పటి ఎస్సై రమేశ్ విచారణ పూర్తి చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. మంగళవారం అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ప్రేమలత సాక్షులను ప్రవేశపెట్టగా నేరం రుజువు కావడంతో దుర్గం నందుకు మూడేళ్ల జైలు, రూ.8వేల జరిమానా, మిగిలిన వారికి రూ.3 వేల చొప్పున జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

అప్పుల బాధతో కౌలురైతు ఆత్మహత్య



రామ్మూర్తి (ఫైల్)

జన్నారం: అప్పులబాధతో కౌలురైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని చింతగూడకు చెందిన సీపతి రామ్మూర్తి (50) మూడేళ్ల క్రితం రూ.6 లక్షలు అప్పుచేసి ఉపాధికోసం రెండుసార్లు దుబాయ్ వెళ్లాడు. అక్కడ పని దొరకకపోవడంతో తిరిగి ఇంటికివచ్చాడు. ఈ ఏడాది గ్రామంలో నాలుగెకరాల భూమిని కౌలుకు తీసుకుని వరి సాగు చేశాడు. అప్పు తీర్చే మార్గం కనబడకపోవడంతో మనస్తాపానికి గురయ్యాడు. సోమవారం సాయంత్రం ఇంట్లో గడ్డి మందు తాగాడు. అపస్మారక స్థితిలో పడిపోవడంతో గమనించిన కుటుంబ సభ్యులు కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతుండగా పరిస్థితి విషమించి మంగళవారం మృతి చెందాడు. మృతునికి భార్య అనసూర్య, కుమారుడు, కూతురు ఉన్నారు. అనసూర్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై సతీశ్ తెలిపారు.

రేషన్ బియ్యం స్వాధీనం

దండేపల్లి: మండలంలోని గుడిరేవు గ్రామానికి చెందిన పుల్ల అంజగౌడ్ ఇంట్లో మంగళవారం అక్రమంగా నిల్వ ఉంచిన 9 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుకున్నట్లు తహసీల్దార్ సంధ్యారాణి తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు తనిఖీ నిర్వహించగా లబ్ధిదారుల నుంచి కొనుగోలు చేసిన రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఆమె పేర్కొన్నారు. బియ్యాన్ని సీజ్ చేసి గ్రామంలోని రేషన్ దుకాణానికి తరలించినట్లు తెలిపారు.

ఆపరేషన్ పేకాట వివాదాస్పదం..?

- కక్ష సాధింపు చర్యలో భాగంగానే సమాచారం..!
- పరిధి దాటి కారులో ఎస్సై సోదాలు
- పెద్దమొత్తంలో నగదు లభ్యం కావడంతో పేకాటగా చిత్రీకరణ



పేకాట అనుమానితులను క్వారీకి తరలిస్తున్న పోలీసులు

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలో ఈ నెల 9న పేకాటరాయుళ్ల అరెస్టుకు చేపట్టిన ఆపరేషన్ పేకాట వివాదాస్పదమైంది. పోలీసుస్టేషన్ పరిధి దాటి, స్థానిక పోలీసులకు సమాచారం లేకుండా పట్టుకోవడం, కారును తనిఖీ చేయడం చర్చనీయాంశంగా మారింది. పెద్దమొత్తంలో డబ్బు లభించడంతో పేకాటగా చిత్రీకరించారని, పేకాడిన స్థలంగా పేర్కొనేందుకు క్వారీ రోడ్డుకు తరలించారని బాధితులు ఆరోపిస్తున్నారు. కక్షసాధింపు చర్యల్లో భాగంగా హాజీపూర్ మండలానికి చెందిన వ్యక్తి ఇచ్చిన సమాచారం మేరకు పేకాటగా చిత్రీకరించారనే ఆడియో వాట్సాప్‌లో వైరల్‌గా మారింది. మంచిర్యాలలోని ఏసీసీ ఏకేఆర్ ఫంక్షన్ హాల్ సమీపంలో ఎన్టీపీసీకి చెందిన పల్లె ఆంజనేయులు, సాదుల సదానందం కారులో రోడ్డు పక్కన ఆగి ఉన్నారు. కొద్దిసేపటి తర్వాత మరో ఇద్దరు కారులో వచ్చి కారులో సోదా చేశారు. దీంతో రూ.4,33,500 నగదు లభించాయి. దీంతో తాను హాజీపూర్ ఎస్సైనంటూ వారిద్దరిని అదుపులోకి తీసుకుని కారుతోపాటు పేకాడిన ప్రదేశంగా చిత్రీకరించేందుకు క్వారీ రోడ్డుకు తరలించారు. ఏసీసీ క్వారీ హాజీపూర్ మండల పరిధిలోకి వస్తుంది. కానీ లా అండ్ ఆర్డర్ పోలీసు లిమిట్స్ మంచిర్యాల పోలీసుస్టేషన్ పరిధిలోకి వస్తుంది. ఈ విషయం తెలియని సదరు ఎస్సై క్వారీలోని ఆలయం వద్ద పేకాడుతుండగా పట్టుకున్నామని ప్రకటించారు. ఆ సమయంలో స్థానిక ఎస్సై లేకపోవడం గమనార్హం.

సమాచారం ఇచ్చింది అతడేనా..?

హాజీపూర్ మండలం వేంపల్లికి చెందిన పేరుమోసిన పేకాటరాయుడుపై గతంలో రామగుండం పోలీసు కమిషనర్‌గా ఉన్న సత్యనారాయణ పీడీ యాక్టు నమోదుకు ఆదేశించారు. అయినా అతడి పద్ధతి మారలేదు. గత నెల జూలై 10న వేంపల్లి సమీపంలోని మంచిర్యాల గార్డెన్‌లో అతడు పేకాడిస్తుండగా హాజీపూర్ ఎస్సై నరేష్ పట్టుకున్నారు. 17మందిని అరెస్టు చేసి రూ.1,07,780 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. ఆంజనేయులు పోలీసులకు పట్టించాడనే కక్షసాధింపు చర్యలో భాగంగా ఆ పేకాటరాయుడు పోలీసులకు పట్టించాడనే ఆడియో వైరల్‌గా మారింది.

పరిధి దాటి సోదాలు

హాజీపూర్ ఎస్సై తన సొంత వాహనంలో తనిఖీకి రావడం, స్థానికంగా ఓ అధికారి అనుమతి ఇచ్చారని చెప్పడం గమనార్హం. జిల్లా కేంద్రంలో ఓ సీఐ, ముగ్గురు ఎస్సైలు ఉండగా పక్క స్టేషన్ ఎస్సైకి దాడి అప్పగించడం ఏమిటని పోలీసు అధికారులు చర్చించుకోవడం గమనార్హం.

పేకాడుతుండగానే పట్టుకున్నాం..

పక్కా సమాచారం మేరకు మంచిర్యాల ఎస్సై రాజేందర్‌తో కలిసి ఒకేసారి రెండు చోట్ల దాడులు చేశాం. ఏసీసీ సమీపంలోని ఏకేఆర్ ఫంక్షన్ హాల్ వద్ద, మరొకటి ఏసీసీ క్వారీ టెంపుల్ వద్ద పేకాడుతుండగా పట్టుకున్నాం. మంచిర్యాల పోలీసులతో కలిసి పేకాట స్థావరంపై రైడ్ చేశాం. కేసును మంచిర్యాల పోలీసులు విచారణ చేస్తున్నారు.

– ఎస్సై నరేష్‌కుమార్, హాజీపూర్

ప్రమాదవశాత్తు చెరువులోపడి వ్యక్తి మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ

చెన్నూర్: పట్టణంలోని ఆస్నాద రోడ్డులో గల కుమ్మరికుంట చెరువులో పడి వ్యక్తి మృతి చెందినట్లు సీఐ వాసుదేవరావు తెలిపారు. ఆదర్శ నగర్ కాలనీలో నివాసం ఉంటున్న సాదుల సురేశ్ (40) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. సోమవారం సాయంత్రం కాలకృత్యాలు తీర్చుకునేందుకు ఇంటినుంచి బయటకు వెళ్లాడు. రాత్రి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెతికినా ఆచూకీ లభించలేదు. మంగళవారం మృతుని భార్య సాదుల సుజాత పోలీసులకు ఫిర్యాదు చేశారు. కుమ్మరికుంట చెరువులో మృతదేహం పడి ఉండడాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని బయటకు తీయించిన పోలీసులు బాధిత కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో సురేశ్‌దేనని గుర్తించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ తెలిపారు.

టింబర్‌యార్డు ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

- హెచ్‌ఎంఎస్ ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్



మాట్లాడుతున్న రియాజ్ అహ్మద్

నస్పూర్: శ్రీరాంపూర్ ఏరియాలోని టింబర్‌యార్డు ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని హెచ్‌ఎంఎస్ ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్ డిమాండ్ చేశారు. మంగళవారం శ్రీరాంపూర్ జీఎం కార్యాలయం ఎదుట నిర్వహించిన రిలే నిరాహార దీక్షలో ఆయన మాట్లాడారు. కార్మికులు 30 ఏళ్లుగా ఉద్యోగం చేస్తున్నప్పటికీ పీస్ రేటెడ్‌గానే పరిగణిస్తున్నారని, వారికి సాయల్ ప్రమోషన్ కల్పించాలని, ఆరో కేటగిరీ వేతనాలు చెల్లించాలని, తదితర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్‌చేశారు. లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని జీఎం సంజీవరెడ్డికి అందజేశారు. ఈ కార్యక్రమంలో బ్రాంచి ఉపాధ్యక్షుడు తిప్పారపు సారయ్య, సెంట్రల్ కార్యదర్శి గోళ్ల సత్యనారాయణ, స్టోర్స్ పిట్ కార్యదర్శి పల్లె క్రాంతికుమార్, వర్క్‌షాప్ పిట్ కార్యదర్శి అశోక్, ఎస్‌ఆర్‌పీ 1 పిట్ కార్యదర్శి రేగుంట సందీప్, ఆర్గనైజింగ్ కార్యదర్శి దుర్గం లక్ష్మణ్, నాయకులు మీస కొమురయ్య, రాజేంద్ర ప్రసాద్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

సీఎం హామీల అమలేది?



మాట్లాడుతున్న ముస్కె సమ్మయ్య

కాసిపేట: ఎన్నికలకు ముందు సీఎం కేసీఆర్ సింగరేణి కార్మికులకు ఇచ్చిన హామీల అమలేదని ఏఐటీయూసీ డెప్యూటీ జనరల్ సెక్రెటరీ ముస్కె సమ్మయ్య ప్రశ్నించారు. మంగళవారం మందమర్రి ఏరియా కాసిపేట గనిపై గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 11వ వేజ్‌బోర్డు 23 నెలల ఏరియర్స్ ఇప్పించడంలో గుర్తింపు సంఘం విఫలమైందన్నారు. సింగరేణిలో రాజకీయ జోక్యంతో కార్మికుల సమస్యలు పరిష్కారం కావడం లేదన్నారు. సొంతింటి పథకం కింద రెండుగుంటల స్థలం, రూ.20 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి బ్రాంచి ఇన్‌చార్జి చిప్ప నర్సయ్య, బ్రాంచి కార్యదర్శి దాగం మల్లేశ్, ఉపాధ్యక్షుడు బియ్యాల వెంకటస్వామి, గని పిట్ కార్యదర్శి మీనుగు లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలు పెంచాలి



నిరసన తెలుపుతున్న నాయకులు

నస్పూర్: సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలు పెంచాలని సింగరేణి కాంట్రాక్ట్ కార్మిక సంఘం(సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షుడు దూలం శ్రీనివాస్ డిమాండ్ చేశారు. పోరుబాట కార్యక్రమంలో భాగంగా మంగళవారం సీసీసీలోని జీటీ హాస్టల్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేతనాల పెంపునకు కోల్‌బెల్ట్ ప్రాంత ఎమ్మెల్యేలు ప్రత్యేక చొరవ చూపాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవో 22 వెంటనే గెజిట్ చేసి కాంట్రాక్టు కార్మికుల వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు తుంగపెల్లి అంకూస్, రంజిత్, నాగరాజు, అనిల్, దేవేందర్, ఐలయ్య, తదితరులు పాల్గొన్నారు.

సేఫ్టీరూల్స్‌పై అవగాహన కల్పించాలి



సమావేశంలో పాల్గొన్న అధికారులు

- డీడీజీఎంఎస్ భూషణ్ ప్రసాద్ సింగ్

మందమర్రిరూరల్: సింగరేణిలో సేఫ్టీ రూల్స్‌పై కార్మికులకు అవగాహన కల్పించాలని హైదరాబాద్ సౌత్ సెంట్రల్ డెప్యూటీ డైరెక్టర్ జనరల్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ (డీడీజీఎంఎస్) భూషణ్ ప్రసాద్‌సింగ్ అన్నారు. మంగళవారం మందమర్రి ఏరియాలోని ఇల్లందు క్లబ్ ఆవరణలో ఏర్పాటు చేసిన ఏరియా స్థాయి 22వ త్రైపాక్షిక రక్షణ సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉద్యోగుల రక్షణ పట్ల యాజమాన్యం అప్రమత్తంగా ఉండాలన్నారు. రక్షణతో కూడిన నాణ్యమైన బొగ్గు ఉత్పత్తి కోసం ఉద్యోగులు, సూపర్‌వైజర్లు, అధికారులు సమష్టిగా కృషి చేయాలన్నారు. డీఎంఎస్ (ఎలక్ట్రికల్) బెహరా, డీడీఎంఎస్ (సేఫ్టీ) వెంకన్న, డీఎంఎస్‌లు (మెకానికల్) ఎం.ఆర్ముగం, జార్జ్ బాస్, ఆక్యుపేషనల్ హెల్త్ ఇన్‌స్పెక్టర్ రాజీవ్ ఓంప్రకాష్, డీడీఎంఎస్ (ఎలక్ట్రికల్) నాగేశ్వరరావు, ఏరియా జీఎం మనోహర్, బెల్లంపల్లి ఏరియా జీఎం రవిప్రసాద్, బెల్లంపల్లి రీజియన్ సేఫ్టీఈఎం కేహెచ్‌ఎన్ గుప్తా, ఎస్వోటూ జీఎం రాజేశ్వరరెడ్డి, ఏరియా ఎస్‌వో రవీందర్, యూనియన్ల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఐకేఓసీపీని సందర్శించిన మార్కెటింగ్ మేనేజర్



వ్యూపాయింట్ నుంచి పరిశీలిస్తున్న దేవేందర్

జైపూర్: ఇందారం ఓపెన్ కాస్టు గనిని మంగళవారం సింగరేణి కార్పొరేట్ మార్కెటింగ్ జనరల్ మేనేజర్ దేవేందర్ సందర్శించారు. బొగ్గు ఉత్పత్తి, నాణ్యతలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. భవిష్యత్ ప్రణాళికలు, బొగ్గు రవాణాపై అధికారులు ప్రణాళిక బద్ధంగా ముందుకెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు అధికారి శ్రీనివాస్, మార్కెటింగ్ అధికారి తాడబోయిన శ్రీనివాస్, గని మేనేజర్ రవికుమార్ పాల్గొన్నారు.

నేటి నుంచి వార్షిక క్రీడలు

నస్పూర్: నేటి నుంచి ఈ నెల 24 వరకు శ్రీరాంపూర్ ఏరియాలోని ప్రగతి స్టేడియంలో సింగరేణి వార్షిక క్రీడాపోటీలు నిర్వహించనున్నట్లు డీజీఎం (పర్సనల్) అరవిందరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటలకు శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి పోటీలను ప్రారంభించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. 13న వాలీబాల్, 14న బాస్కెట్ బాల్, 15న ఫుట్‌బాల్, 16, 17తేదీల్లో క్రికెట్, 17న క్యారమ్స్, చెస్, టేబుల్ టెన్నిస్, షటిల్ బ్యాడ్మింటన్, 18న హాకీ, 19న బాల్ బ్యాడ్మింటన్, 20న కబడ్డీ, 21న లాన్ టెన్నిస్, 22న అథ్లెటిక్ (మెన్ అండ్ ఉమెన్), ఈత పోటీలు(మెన్), త్రోబాల్ (ఉమెన్), 24న కల్చరల్ (మెన్ అండ్ ఉమెన్), బాడీ బిల్డింగ్, వెయిట్ లిఫ్టింగ్ అండ్ పవర్ లిఫ్టింగ్ పోటీలు నిర్వహించనున్నట్లు డీజీఎం తెలిపారు.

14న అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు

మంచిర్యాలటౌన్: జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో లక్సెట్టిపేట్‌లోని మహాత్మా జ్యోతిబాపూలే బాలుర పాఠశాలలో ఈ నెల 14న జిల్లాస్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎం. సాంబమూర్తి, ఈ.మారయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 14, 16, 18, 20 సంవత్సరాలలోపు బాలబాలికలు, 20 ఏళ్ల పైబడిన స్త్రీ, పురుషులకు అన్ని కేటగిరీల్లో పోటీలు నిర్వహిస్తారన్నారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు పుట్టిన తేదీ సర్టిఫికెట్‌తో పాఠశాల పీడీ రాజేశ్, పీఈటీ కార్తీక్‌కు ఉదయం 7 గంటలకు రిపోట్ చేయాలని సూచించారు. పోటీల్లో ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 30 నుంచి అక్టోబర్ 1 వరకు కరీంనగర్‌లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని వారు పేర్కొన్నారు.

దేశీదారు పట్టివేత



పట్టుకున్న మద్యంతో అధికారులు

కాగజ్‌నగర్‌టౌన్: పట్టణంలోని సంఘం బస్తీలో తమకు అందిన సమాచారం మేరకు మంగళవారం దాడులు నిర్వహించి 54 దేశీదారు బాటిళ్లను స్వాధీనం చేసుకుని నిందితుడు మహేష్‌పై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ మంగమ్మ తెలిపారు. ఎస్సై స్వాతి, లింగయ్య, నవీన్, సతీష్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

విద్యుత్‌షాక్‌తో యువకుడు మృతి



ఉదయ్‌కిరణ్(ఫైల్)

ఆసిఫాబాద్‌రూరల్: విద్యుత్‌షాక్‌తో యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. మృతుని కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని గుండి గ్రామానికి చెందిన కుబ్డే ఉదయ్ కిరణ్ (18) సోమవారం రాత్రి ఇంట్లో ఫ్యాన్ తిరగకపోవడంతో విద్యుత్ వైర్లు సరిచేసే క్రమంలో షాక్ తగలడంతో కిందపడిపోయాడు. కుటుంబ సభ్యులు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుని తండ్రి కిషన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై రాజేశ్వర్ తెలిపారు.

14న జాబ్‌మేళా

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలోని ఉపాధి కల్పన అధికారి కార్యాలయంలో ఈ నెల 14న గురువారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి కౌశిక వెంకటరమణ తెలిపారు. ఆదర్శ ఆటోవరల్డ్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో సీనియర్ రిలేషన్‌షిప్ మేనేజర్ 5, రిలేషన్‌షిప్ మేనేజర్ 10 పోస్టుల కోసం 21 నుంచి 30 ఏళ్లలోపు ఉండి డిగ్రీ ఉత్తీర్ణత కలిగిన పురుష అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 9505354969, 9573695943 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

శభాష్ పోలీస్

- 24 గంటల్లో కేసును ఛేదించిన టాస్క్‌ఫోర్స్ పోలీసులు
- వివరాలు వెల్లడించిన సీపీ రెమా రాజేశ్వరి



వివరాలు వెల్లడిస్తున్న సీపీ రెమా రాజేశ్వరి

మంచిర్యాలక్రైం: షేర్ మార్కెటింగ్ పేరుతో అమాయకుల నుంచి రూ.2.11కోట్లు వసూలు చేసి ఐదు నెలలుగా తప్పించుకు తిరుగుతున్న ఘరానా మోసగాడిని అరెస్టు చేసినట్లు సీపీ రెమా రాజేశ్వరి తెలిపారు. మంగళవారం కమిషనరేట్ హెడ్‌క్వార్టర్స్‌లో వివరాలు వెల్లడించారు. స్థానిక గోసేవ మండల్ రోడ్‌లో నివాసం ఉంటున్న చెవ్వ రవి డీటీపీ వర్క్ చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. సులభంగా డబ్బు సంపాదించాలనే దురుద్దేశంతో షేర్ మార్కెట్‌లో పెట్టుబడులు పెడితే అధిక లాభాలు వస్తాయని నమ్మించి మంచిర్యాల, పెద్దపల్లి జిల్లాలో సుమారు 50 మంది వద్దనుంచి రూ.2.11కోట్లు వసూలు చేశాడు. స్థానిక ఎడ్లవాడకు చెందిన గట్టు సంతోష్‌కు ట్రేడ్ మార్కెటింగ్‌లో శిక్షణ ఇస్తానని రూ.3.9లక్షలు కాజేయడంతో ఈ నెల 11న చీటింగ్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. సాంకేతికతను ఉపయోగించిన పోలీసులు స్థానిక రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి ప్రాంతంలో వలపన్ని నిందితుడిని అరెస్టు చేశారు. ఫిర్యాదు అందిన 24 గంటల్లోనే నిందితుడిని అరెస్టు చేసిన టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మల్లారెడ్డి, సీఐ డీ.సుధాకర్, ఆకుల అశోక్‌ను సీపీ అభినందించారు. కాగా రవి అరెస్ట్ విషయం వెలుగులోకి రావడంతో జిల్లాలోని మరికొందరు బాధితులు ఫిర్యాదు చేసేందుకు సిద్ధమవుతున్నట్లు తెలిసింది.

అంగన్‌వాడీల సమ్మెపై సీఎం జోక్యం చేసుకోవాలి



మాట్లాడుతున్న దుర్గాభవాని

బెల్లంపల్లి: అంగన్‌వాడీల సమ్మెపై సీఎం కేసీఆర్ జోక్యం చేసుకోవాలని మహిళా కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి సీహెచ్ దుర్గాభవానీ అన్నారు. మంగళవారం బెల్లంపల్లిలో అంగన్‌వాడీ టీచర్లు చేస్తున్న సమ్మె శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు సమ్మె చేస్తుండడంతో చిన్నారులకు పౌష్టికాహారం అందడంలేదన్నారు. ఇందుకు ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. ప్రభుత్వం దిగి వచ్చి సమస్యలు పరిష్కరించేంత వరకు సమ్మె కొనసాగించాలని, కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందన్నారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలి

పాతమంచిర్యాల: పార్లమెంటు సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు చెన్నూరి సమ్మయ్య డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తాలో ఎమ్మార్పీఎస్ నాయకులు రిలే నిరాహారదీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు కట్టుబడి ఉన్నామని పాలకులు 29 ఏళ్లుగా మాదిగలను మోసం చేస్తున్నారన్నారు. దీక్షకు కాంగ్రెస్ నాయకులు డాక్టర్ నీలకంఠేశ్వర్‌రావు, డాక్టర్ దాసారపు శ్రీనివాస్, సీపీఐ నాయకులు రేగుంట చంద్రశేఖర్ మద్దతు ప్రకటించారు. కార్యక్రమంలో ఎంఎస్‌పీ జిల్లా ఇన్‌చార్జి గుండా థామస్, ప్రధాన కార్యదర్శి సిందిళ్ల మల్లేశ్, ఉపాధ్యక్షుడు జలంపల్లి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

జ్వరంతో జన్నారం వాసి మృతి

జన్నారం: ఉట్నూర్‌కు చెందిన షేక్ మోసిన్(35) జన్నారంలో పాల ఏజెన్సీ నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. పది రోజులుగా జ్వరంతో బాధపడుతున్నాడు. మంగళవారం ఉదయం పాలు అమ్ముకుని ఇంటికి వెళ్లిన అనంతరం అస్వస్థతకు గురయ్యాడు. మండల కేంద్రంలోని ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లగా పరీక్షించిన వైద్యులు రక్తకణాలు తగ్గినట్లు నిర్ధారించారు. కుటుంబ సభ్యులు వెంటనే మంచిర్యాల ఆస్పత్రికి తీసుకెళ్లగా పరిస్థితి విషమించి మృతి చెందినట్లు మృతుని మామ ఇసామోద్దీన్ తెలిపారు. మృతునికి భార్య, కుమారుడు ఉన్నారు.

యువతి అనుమానాస్పద మృతి



మౌనిక (ఫైల్)

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని పద్మశాలికాలనీకి చెందిన పల్లికొండ రాజనర్సు–విజయలక్ష్మి దంపతుల కుమార్తె మౌనిక(23) హైదరాబాద్‌లోని జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలోని నెహ్రూనగర్‌లో ఓ ఇంట్లో అనుమానాస్పదంగా మృతి చెందింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు సదరు యువతి హైదరాబాద్‌లోని ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం చేస్తోంది. మంగళవారం పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకుందని పోలీసులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతికి సంబంధించిన వివరాలు తెలియరాలేదు.

ఎడ్లబండిని ఢీకొని వ్యక్తి మృతి

దహెగాం: మండల కేంద్రం నుంచి కల్వాడ వెళ్లే మార్గంలో కమ్మర్‌పల్లి ఎక్స్‌రోడ్డు వద్ద మంగళవారం రాత్రి ద్విచక్ర వాహనం ఎడ్లబండిని ఢీకొన్న ఘటనలో వ్యక్తి మృతి చెందాడు. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు బెజ్జూర్ మండలం సల్గుపల్లికి చెందిన దుర్గం బిక్కయ్య, పోసక్క దంపతులు సల్గుపల్లి నుంచి ఎక్సెల్ వాహనంపై మంచిర్యాలకు వెళ్తుండగా దహెగాం వైపు వస్తున్న దాసరి కిషన్‌కు చెందిన ఎడ్లబండికి ఢీకొట్టడంతో బిక్కయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. పోసక్కకు గాయాలు కావడంతో దహెగాం పీహెచ్‌సీకి తరలించారు. విషయం తెలుసుకున్న ఎస్సై సనత్‌కుమార్ సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు.

గోలేటి సీహెచ్‌పీలో ప్రోత్సాహక స్కీం

రెబ్బెన(ఆసిఫాబాద్): బెల్లంపల్లి ఏరియాలోని గోలేటి సీహెచ్‌పీలో ఉద్యోగులకు బొగ్గు రవాణాపై ప్రోత్సాహక స్కీం అమలు చేస్తూ సింగరేణి యాజమాన్యం సర్క్యులర్ జారీ చేసినట్లు టీబీజీకేఎస్ బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు మల్రాజు శ్రీనివాస్‌రావు తెలిపారు. మంగళవారం గోలేటిలో ఆయన మాట్లాడుతూ సీహెచ్‌పీ ప్రారంభమై మూడేళ్లు గడుస్తున్నప్పటికీ ఉద్యోగులకు ప్రోత్సాహక స్కీం ప్రవేశపెట్టకపోవడంతో విషయాన్ని యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లామన్నారు.

ట్రెయినీ ఎఫ్‌బీవోల పర్యటన

జన్నారం: దూలపెల్లి ఫారెస్ట్ అకాడమీకి చెందిన 36 మంది బీట్ అధికారులు శిక్షణలో భాగంగా మంగళవారం కవ్వాల్ టైగర్‌జోన్‌లోని జన్నారం అటవీ డివిజన్‌లో పర్యటించారు. ఉదయం డివిజన్ కేంద్రంలోని టీడీసీలో ఎఫ్‌డీవో మాధవరావు వారికి అడవుల రక్షణ, వన్యప్రాణుల సంరక్షణ, అధికారుల విధులు, వన్యప్రాణుల రక్షణకు తీసుకుంటున్న చర్యలు, చేస్తున్న అభివృద్ధి పనుల గురించి ప్రొజెక్టర్ ద్వారా వివరించారు. ఫీల్డ్ వర్క్‌లో భాగంగా గోండుగూడ బేస్‌క్యాంప్, తదితర ప్రాంతాల్లో పర్యటించి గడ్డి క్షేత్రాలు, కుంటలను పరిశీలించారు.

ఫ్యూచర్ ఓటర్, యంగ్ ఓటర్‌పై పోటీలు

మంచిర్యాలఅర్బన్: స్వీప్ ఆధ్వర్యంలో పాఠశాల స్థాయిలో ఫ్యూచర్ ఓటర్ (భవిష్యతు ఓటరు), కళాశాల స్థాయిలో యంగ్ ఓటరు (యువ ఓటరు) స్క్రిప్ట్, పద్యాలు, పోటీలు నిర్వహిస్తున్నట్లు డీఈవో యాదయ్య తెలిపారు. మండల స్థాయిలో ఈనెల 16న పోటీలు జరుగుతాయన్నారు. ఒకటో విభాగంలో 9 నుంచి 12వ తరగతి వరకు భవిష్యత్ ఓటరు, రెండో విభాగంలో కళాశాల విద్యార్థులకు యువ ఓటరుపై పోటీలు జరుగుతాయన్నారు. పూర్తి వివరాలకు జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శేషాద్రిని 9640471540 నంబరులో సంప్రదించాలన్నారు.